సాక్షి ఒడిశా
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,92,547
బంగారం 4 గ్రాముల 550 మిల్లీ గ్రాములు
వెండి 170 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



ముగిసిన చౌయితి ఉత్సవాలు

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న చౌయితి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి.

- 10లో



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మేనేజర్ వినోద్ కుమార్ దాస్ సూచించారు.

- 10లో

న్యూస్‌రీల్

ఎన్నికల్లో పొత్తు ప్రసక్తి లేదు

- 50 శాతం ఓట్లతో అధికారంలోకి వస్తాం
- బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సాల్

భువనేశ్వర్: రాష్ట్రంలో వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ప్రసక్తి లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ శనివారం స్పష్టం చేసింది. ప్రధానంగా రాష్ట్రంలో అధికార పక్షం బిజూ జనతాదళ్ (బీజేడీ)తో పొత్తు పెట్టుకునే యోచనే లేదని ప్రకటించింది. స్థానిక రాష్ట్ర శాఖ కార్యకర్తలతో జరిగిన సమావేశం అనంతరం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సాల్ మాట్లాడుతూ బీజేడీతో పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదన్నారు. రాష్ట్రంలో మొత్తం 147 అసెంబ్లీ, 21 లోక్‌సభ స్థానాల్లో భాజపా ఒంటరిగా పోటీ చేస్తుందని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో తీవ్ర పోటీ ఇస్తుందని తెలిపారు. సమగ్రంగా 157 కేంద్ర సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడం ద్వారా పార్టీ ఎన్నికల్లో కనీసం 50 శాతం ఓట్ల వాటా లక్ష్యంగా పార్టీ కృషి చేస్తుందన్నారు. సమావేశం అనంతరం పార్టీ సీనియర్ నాయకురాలు, స్థానిక లోక్‌సభ సభ్యురాలు అపరాజిత షడంగి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్టీ కార్యకర్తలతో న్యూఢిల్లీలో సమావేశం నిర్వహించి, 2024 సంవత్సరంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలా ముందుకు సాగాలో సూచించారని వివరించారు. తాజాగా జరిగిన పార్టీ రాష్ట్ర శాఖ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జి బన్సాల్ ఈ నేపథ్యంలో పలు సూచనలు జారీ చేశారన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎలాంటి రాజీ లేదా పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోరాడుతుందనేది తొలి సూచనగా పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాలతో కొంతమంది బీజేపీ-బీజేడీ పొత్తు కుదుర్చుకుంటాయని పుకార్లు వ్యాపింపజేస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. అదే తరహాలో రాష్ట్ర శాసన సభలో ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) జయ నారాయణ మిశ్రా మాట్లాడుతూ బీజేడీతో బీజేపీకి ఎటువంటి అవగాహన లేదన్నారు. ఆ పార్టీతో పొత్తు పెట్టుకోకుండానే ఎన్నికల్లో బీజేపీ పోరాడుతుందని తెలియజేశారు. బూత్ స్థాయి నుంచి కనీసం 50 శాతం ఓట్లను సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ దాదాపుగా ఉనికి కోల్పోయినందున ఈసారి ఎన్నికలు బీజేపీ, బీజేడీల మధ్య పోరుగా మారనున్నాయని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి డీజీపీగా అరుణ్ కుమార్ షడంగి

భువనేశ్వర్: ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి అరుణ్ కుమార్ షడంగి నియమితులయ్యారు. ఆయన 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. నియమిత రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు నియామకం వరకు ఆయన ఈ హోదాలో తాత్కాలిక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పోలీసు శిక్షణ ప్రత్యేక డీజీ, బీపీఎస్‌పీఏ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర హోం శాఖ శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు నిర్వహించిన సునీల్ కుమార్ బన్సాల్ ఈనెల 31వ తేదీ నుంచి ఉద్యోగ విరామం పొందేందుకు విభాగం ఆమోదించింది. దీంతో కీలకమైన ఈ హోదా ఖాళీ అవుతుంది. ఆ స్థానంలో అరుణ్ కుమార్ షడంగి తాత్కాలిక డీజీపీగా బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వులు స్పష్టం చేశాయి.

సీఎస్ ప్రదీప్ కుమార్ పదవీకాలం పొడిగింపు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా పదవీకాలం పొడిగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పదవీకాలం మరో 6 నెలలు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రదీప్ కుమార్ జెనా పదవీకాలం ఈనెల 31తో ముగుస్తుంది. సార్వత్రిక ఎన్నికలు-2024 దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి నాటికి వివిధ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పరిస్థితిలో పదవీకాలాన్ని పొడిగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ కుమార్ జెనాను ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఆయన మార్చి 1న బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణని దక్షతతో నిర్వహించగలిగే అధికారిగా విశేష గుర్తింపు సాధించారు. అంతకుముందు ఆయన రాష్ట్ర అభివృద్ధి కమిషనర్‌గా పని చేశారు. లోగడ ధర్మగడ్ సబ్ కలెక్టర్‌గా ఉద్యోగ జీవితానికి శ్రీకారం చుట్టారు. 1999 సూపర్ సైక్లోన్ విపత్కర సమయంలో కటక్ జిల్లా కలెక్టర్‌గా ఆయన కార్యదక్షత చాటుకున్నారు. రాష్ట్రంలో తుఫాన్, వరదలు వంటి విపత్కర పరిస్థితుల నిర్వహణ, కోవిడ్ మహమ్మారి వ్యవహారం వంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వ అధికారిగా కార్యశైలిని అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి పదవీకాలాన్ని పొడిగించినట్లు సమాచారం.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా













నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గంజాం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌కు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి తంపర ఉప్పునీటి సరస్సు పర్యాటకులతో సందడిగా మారింది. ఒడిశా పర్యాటక అభివృద్ధి సంస్థ ఇటీవల ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టడంతో ఉత్సాహంగా గడుపుతున్నారు. వాటర్ స్పోర్టింగ్, బోటింగ్, పెడల్ బోట్స్, వాటర్ స్కూటర్, స్కేటింగ్ వంటి సౌకర్యాలతో పాటు పర్యాటకులు బస చేసేందుకు రెస్టారెంట్లు ఏర్పాటు చేయడంతో ఎంజాయ్ చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలు ఆంధ్ర, పశ్చిమ బెంగాల్ నుంచి సైతం పర్యాటకుల తాకిడి పెరిగింది.

– బరంపురం

సముద్రంలో రెండు పడవలు ఢీ

- ఒకరు మృతి



బైరాగి మృతదేహం



బైరాగిని ఒడ్డుకి చేరుస్తున్న మత్స్యకారులు

బరంపురం: గోపాల్‌పూర్ తీరంలో రెండు పడవలు ఢీకొనడంతో ఒక మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాల మేరకు.. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి మత్స్యకారులు సముద్రంలోకి గోపాల్‌పూర్ తీరం నుంచి పడవల్లో చేపల వేటకి వెళ్లారు. చేపల వేట కొనసాగిస్తున్న సమయంలో శనివారం వేకువజామున మంచు ఎక్కువగా కురవడంతో దారి కనిపించక ఎదురెదురుగా వస్తున్న రెండు పడవలు ఢీకొన్నాయి. దీంతో రెండు పడవల్లో ఉన్నటువంటి 18 మంది మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. సమాచారం అందడంతో గోపాల్‌పురం తీరం నుంచి మరికొన్ని పడవల్లో మత్స్యకారులు లోపలికి వెళ్లి 18 మంది మత్స్యకారులను ఒడ్డుకు చేర్చారు. తీవ్ర గాయాలపాలైన బి.బైరాగి అనే వ్యక్తిని బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సముద్రం మధ్యలో బోల్తా పడిన పడవలను తాళ్లుకట్టి ఒడ్డుకి చేర్చారు. అయితే వేటకు తీసుకెళ్లిన వలలు సముద్రంలో మునిగిపోయాయి. గాయపడిన మత్స్యకారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చనిపోయిన మత్స్యకారుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, నష్టపోయిన బోట్లకు పరిహారం అందజేయాలని గంజాం జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఎ.ఎర్రయ్య కోరారు.



తాడుతో పడవలను ఒడ్డుకు లాగుతున్న దృశ్యం





విరిగిపోయిన మత్స్యకారుల పడవలు

రైతుల కల నెరవేరనుంది



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- రూ.577 కోట్లతో మెగా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- సీఎం నవీన్ పట్నాయక్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

కొరాపుట్: నబరంగపూర్ జిల్లాలోని టురి, గంగాయత్ నదుల మీద రూ.577 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మెగా లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఈ ప్రాంత ప్రజల 50 ఏళ్ల కల నెరవేరనుందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జంక్షన్ వద్ద సర్క్యూట్ హౌస్ ఎదుట జరిగిన బహిరంగ సమావేశాన్ని ఉద్దేశిస్తూ వర్చువల్ విధానంలో ప్రసంగించారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నబరంగ్‌పూర్ సమితిలో 40 గ్రామాల్లోని 9,137 హెక్టార్ల భూమికి రబీ పంటకి సాగునీరు అందుతుందన్నారు. దీనికోసం రెండు బ్యారేజీలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే పర్వత గిరి పథకం ద్వారా 11 ప్రాజెక్టులు నిర్మిస్తామని తెలియజేశారు. దీనిలో భాగంగా రూ.1,272 కోట్ల వ్యయంతో 19,200 హెక్టార్ల భూమికి సాగునీరు అందుతుందన్నారు. కొసాగుమ్మ, నందాహండి, నబరంగ్‌పూర్, తెంతులకుంటి సమితుల్లోని 121 గ్రామాల్లో సుమారు పది వేల మందికి తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఇంద్రావతి రిజర్వాయర్‌లోని కపూర్ డ్యామ్ ద్వారా కెందుగూడ ఘట్ నుంచి నీరు తరలిస్తామన్నారు. ఈ రెండు పథకాలు జిల్లాలోని గిరిజనుల జీవితాలు మారుస్తాయని సీఎం పేర్కొన్నారు. అంతకు ముందు 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్ మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి నబరంగ్‌పూర్ జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల్లో ప్రజలు బిజూ స్వాస్థ్య కల్యాణ యోజన పథకం కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా 90 శాతం ప్రజలకు ఏడాదికి పురుషులకు రూ.5 లక్షలు, మహిళలకు రు.10 లక్షలు ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందని తెలియజేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఉచిత వైద్యం పొందవచ్చనని వెల్లడించారు. అనంతరం సీఎం నవీన్ పట్నాయక్ ఈ రెండు పథకాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అప్రమత్తం



- కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో చర్యలు
- ఆస్పత్రులకు రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ మిశ్రా లేఖ

భువనేశ్వర్: రాష్ట్రంలో గత 24 గంటల్లో మరో 5 మందిలో కోవిడ్-19 పాజిటివ్ ఖరారు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఆరోగ్య అధికారులు, వైద్య బోధన ఆస్పత్రులను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన జిల్లా వైద్యాధికారులు (సీడీఎంవో), ప్రజారోగ్య వైద్యాధికారులు, వైద్య బోధన ఆస్పత్రులు, రౌర్కెలా ఆర్‌జీహెచ్, స్థానిక క్యాపిటల్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా శనివారం లేఖలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఇటీవల కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆకస్మిక పెరుగుదలను ఎదుర్కోవడానికి తక్షణ, సత్వర చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యాచరణ కోసం అప్రమత్తతతో వ్యవహరించాలని ప్రజారోగ్య సంచాలకులు, అధికారులకు ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి అన్ని స్థాయిల ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో అనుబంధ సరంజామాతో ఎల్లవేళల్లో సిద్ధంగా ఉండాలని తెలిపారు. కోవిడ్ పాజిటివ్ ఖరారైన వారికి గృహ నిర్బంధం నియమావళి ఖచ్చితంగా పాటించడంపై అవగాహపరచి అవసరమైన చికిత్స అందిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నత స్థాయి చికిత్స కోసం ప్రత్యేక పడకలు, ఆక్సిజన్ మద్దతు ఇతరేతర ప్రాణ రక్షణ చికిత్స, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

వ్యూహాత్మకంగా ఉండాలి

కరోనా సంక్రమణ, నివారణపై సామాన్య ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగాలు వ్యూహాత్మకంగా వ్యవహరించడం అనివార్యంగా పేర్కొన్నారు. కరోనా లక్షణాలు కనిపించిన వ్యక్తులు, దీర్ఘకాలిక రోగ పీడిత వృద్ధులు తప్పనిసరిగా కోవిడ్ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఒడిశా మెడికల్ కార్పొరేషను లిమిటెడ్ సమన్వయంతో టెస్ట్ కిట్, మందులు మరియు వినియోగ వస్తువులు తగినన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అప్రమత్తం చేశారు. నిబంధనల ప్రకారం సకాలంలో డేటా ఎంట్రీ మరియు రిపోర్టింగ్ ప్రక్రియ కొనసాగించాలన్నారు.

వేడుకలకు దూరం మేలు

రాష్ట్రంలో కోవిడ్-19 కేసులు క్రమంగా పెరుగుతున్న సంకేతాలు బలపడుతున్నాయి. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలను గమనించే వ్యక్తులు న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం శనివారం సూచించింది. జన సంచార ప్రదేశాలను సందర్శించడం మానుకుని, మాస్కులు ధరించాలని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్దే నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని హితవు పలికారు. ప్రధానంగా జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్నవారు కొత్త సంవత్సర వేడుకల కోసం రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్లడం మానుకోవాలని, ఈ వ్యక్తులు తమ ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు.

యువతి హత్యపై దర్యాప్తు ప్రారంభం

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్రైమ్ బ్రాంచ్
- పలువురిని ప్రశ్నిస్తున్న అధికారులు



చంద్రపూర్‌లో దర్యాప్తు చేస్తున్న క్రైమ్ బ్రాంచ్ బృందం



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో మా గృహం మేనేజర్‌గా పనిచేసే ఆదివాసీ యువతి లక్ష్మీ మాఝి (23) హత్య కేసుకు సంబంధించి క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం పది మందితో కూడిన బృందం చంద్రపూర్‌లో పర్యటించింది. క్రైమ్ బ్రాంచ్ డీఎస్పీ నరేంద్రబెహర నేతృత్వంతో కూడిన బృందం యువతి హత్యకు గురైన ప్రాంతంలో పర్యటించి అక్కడ పరిసరాలను పరిశీలించారు. అనంతరం మా గృహంలో పనిచేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రపూర్‌లోని అలిసా అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న మా గృహంలో ఆమె గత ఐదేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తుంది. ఈనెల 21వ తేదీ సాయంత్రం ఆమె ఆచూకీ తెలియకపోవడంతో సిబ్బంది వెదకడం ప్రారంభించారు. మా గృహానికి సమీపంలోని ఆస్పత్రి వెనుక కాలిపోయిన లక్ష్మీ మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో దర్యాప్తు ప్రారంభమైంది. అయితే ఆదివాసీ మహిళ హత్యకు గురై వారం రోజులు కావస్తున్నా పోలీసులు నిందితులను పట్టుకోవడంలో విఫలమయ్యారని బీజేపీ పార్టీకి చెందిన మహిళా మోర్చ రాష్ట్ర శాఖ నాయకులు ఈనెల 26వ తేదీన ఆందోళన చేపట్టిన సంగతి విధితమే. ఈ మేరకు వారు ఆరు గంటల పాటుగా రాయగడలో బంద్ నిర్వహించారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తునకు ఆదేశించింది.

పోలీసుల అదుపులో 10 మంది..?

ఇదిలా ఉండగా లక్ష్మీ హత్యకు సంబంధించి 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్యకు గురికావడానికి ముందుగా ఆమెతో ఫోన్‌లో సంభాషించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

బంద్‌కు పిలుపు

లక్ష్మీ హత్యను నిరసిస్తూ జిల్లా ఆదివాసీ మహా సంఘం ఆందోళనలకు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన జిల్లావ్యాప్తంగా బంద్ పాటించేందుకు ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పల స్వామి కద్రక నేతృత్వంలో స్థానిక జేఎస్‌పో సమీపంలోని కద్రక కార్యాయంలో ఈ మేరకు శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పల స్వామి కద్రక మాట్లాడుతూ ఆదివాసీలపై తరచూ అత్యాచారాలు, అన్యాయాలు కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్థానిక మజ్జిగౌరి మందిరం ట్రస్టు సభ్యుడిగా వ్యవహరించే మాజీ కౌన్సిలర్ భగీరథి మండంగి 2010 డిసెంబర్ 15న దారుణంగా హత్యకు గురైనా, ఇంతవరకు హత్యకు సంబంధించిన నిందితులను పోలీసులు పట్టుకోవడంలో విఫలం చెందారని ఆరోపించారు. అదే విధంగా 2019లో జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా విధులు నిర్వహించే గుణుపూర్‌కు చెందిన పురుషోత్తం గొమంగో కూడా గుర్తు తెలియని దుండగుల చేతిలో హత్యకు గురైనా ఆ కేసులో కూడా పోలీసులు విఫలం చెందారని గుర్తు చేశారు. ఇలా వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నా పోలీసులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురాన విగ్రహావిష్కరణ



త్రిపురాన రాఘవదాసు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురాన రాఘవదాసు విగ్రహాన్ని శాంతి నగర్ కాలనీలోని గాంధీమందిరంలో శనివారం మాజీ మంత్రి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీపిలుపు మేరకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేశారని అన్నారు. స్వాతంత్ర్య యోధుల స్మృతి వనంలో తన తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ముందుగా త్రిపురాన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిరం సభ్యులు పాల్గొన్నారు.

పోలాకి విద్యార్థినికి కౌశల ప్రతిభా అవార్డు



కౌశల్ ప్రతిభ అవార్డును అందుకుంటున్న మనీషా

పోలాకి: రాష్ట్రస్థాయి కౌశల్ ప్రతిభ అన్వేషణ పోటీ పరీక్షలో పోలాకి విద్యార్థిని పాలకొండ మనీషా ఉత్తమ అవార్డును అందుకుంది. మనీషా ఈదులవలస ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శనివారం విజయవాడ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్స్‌లో నిర్వహించిన పోటీల్లో మనీషా పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయులు రాంబాబు తెలిపారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎస్ఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి చేతులమీదుగా మనీషా ఉత్తమప్రతిభా అవార్డును అందుకుంది.

లెర్నింగ్ బై డూయింగ్ తరగతుల పరిశీలన



లెర్నింగ్ బై డూయింగ్ తరగతులు పరిశీలిస్తున్న డీవీఈఓ ప్రకాశరావు

పోలాకి: ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వ్యవస్థలోనైనా నైపుణ్యం కలిగి ఉంటేనే యువత రాణించగలుగుతారని డీవీఈఓ కె.ప్రకాశరావు అన్నారు. శనివారం పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్తి నైపుణ్య కోర్సును చదువుతున్న విద్యార్థుల లెర్నింగ్ బై డూయింగ్ తరగతులను ఆయన పరిశీలించారు. ఎడ్యుకేషన్ కం ట్రైనింగ్‌గా విద్యార్థులు భావించాల్సిన కోర్సులకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని అన్నారు. నైపుణ్యం కలిగిన యువత నేడు ప్రపంచానికి ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బీవీఎల్ నర్సింహరావు, శ్రీమతి దేవి, కె.కూర్మస్వామి, కళాశాల ప్రిన్సిపల్ గోవిందరావు తదితరులు ఉన్నారు.

ఎస్‌జీటీలకు హెచ్‌డబ్ల్యూఓలుగా అవకాశం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు గ్రేడ్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా అవకాశం కల్పించనున్నారు. అర్హులైన ఎస్‌జీటీలు వచ్చేనెల 5వ తేదీలోగా ట్రైబల్‌వెల్ఫేర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి శనివారం ఓ ప్రకటనలో కోరారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి

ఎల్.ఎన్.పేట: గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి అన్నారు. మండలంలోని చొర్లంగి గ్రామ సచివాలయం పరిధిలోని కొత్తబాలేరు గ్రామంలో గిరిజనులతో శనివారం సమావేశమయ్యారు. గిరిజన లబ్ధిదారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల కోసం గిరిజనులకు అవగాహన కలిగించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గిరిజనులకు పథకాలపై అవగాహన కలిగించాలని సూచించారు. తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ లబ్ధి వచ్చేలా కేంద్రం అనేక బీమా పథకాలను తీసుకు వచ్చిందని వివరించారు. పోడు పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించటం, పోడు భూములకు హక్కు కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్, ఉప తహసీల్దారు రషీద్ అహ్మద్, పలు శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీక్షేత్రంలో భక్తుల రద్దీ

- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం



భువనేశ్వర్: కొత్త సంవత్సరం పురస్కరించుకుని పూరీ శ్రీమందిరంలో భక్తుల రద్దీ పెరిగింది. గత రెండు రోజులుగా పెద్ద సంఖ్యలో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీ నియంత్రణతో సులభ దర్శనం కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. శ్రీజగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) శనివారం ఈ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం, సేవాయత్‌లు, పోలీసు శాఖ వర్గాలతో సమీక్ష సమావేశం నిర్వహించింది. భక్తుల సౌకర్యార్థం బొడొదండొలో ఏసీ షెడ్ ఏర్పాటవుతోంది. దీనిలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కూర్చునేందుకు వీలుగా సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులను మందిరంలోకి తీసుకెళ్లేందుకు దాదాపు 50 మంది వాలంటీర్లను నియమించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీసు బలగాలను మోహరిస్తారు. 20 మంది డీఎస్పీలు, 50 మంది ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో మొత్తం 90 ప్లాటూన్ల పోలీసు బలగాలను నియమిస్తున్నారు. పర్యాటకుల భద్రత కోసం సముద్ర తీరంలో తగిన సంఖ్యలో లైఫ్‌గార్డులను నియమించనున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు మార్కెట్ స్క్వేర్ నుంచి బొడొదండొ సింహద్వారం వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నివారించి జీరో జోన్‌గా ప్రకటించారు. అదేవిధంగా ఈనెల 31 నుంచి జనవరి 2 వరకు మెరైన్ డ్రైవ్‌లోని దిగొబారెణి నుంచి లైట్‌హౌస్ వరకు వాహనాల రాకపోకలను అనుమతించరు. పూరీకి వచ్చే అన్ని టూరిస్ట్ బస్సులను పట్టణ శివార్లలోని మాలతీపట్‌పూర్‌లో నిలుపుతారు. జగన్నాథ్ వల్లభ్, జైలు రోడ్డు, శారదా బాలి, జాత్రిక వద్ద అన్ని రకాల తేలికపాటి వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం బొడొదండొలో నిర్దిష్ట స్థలాలను యంత్రాంగం గుర్తించింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వాక్‌థాన్ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మేనేజర్ వినోద్ కుమార్ దాస్ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక ఫారెస్టు గేటు నుంచి వాకథాన్ ర్యాలీని ఆర్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమాకాంత సాహు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు వినియోగదారులు ఓటీపీలు ఎవరితోనూ షేర్ చేసుకోకూడదని స్పష్టం చేశారు. అనంతరం టౌను హాల్‌లో జరిగిన సాధారణ సభలో వినోద్ కుమార్ దాస్ మాట్లాడుతూ బ్యాంకు కస్టమర్లు ప్రైవేటు లోన్ యాప్స్ వినియోగించవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే 24 గంటల్లో సంబంధిత బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేయాలని, ఆర్‌బీఐకి మూడు రోజుల్లో ఫిర్యాదు చేయాలని లేదా 1930కి వెంటనే డయల్ చేసి కంప్లెయింట్ రిజిస్టర్ చేయాలని సూచించారు. బ్యాంకు వినియోగదారులు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనా పథకం, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు లీడ్ బ్యాంక్ మేనేజర్ మహేశ్వర్ మండల్, నాబార్డు బ్యాంకు డీడీఎం ప్రతీక్ పండా, ఆర్‌బీఐ డీజీఎం ఉమాకాంత సాహు, ఆర్‌బీఐ అధికారి అభిషేక్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు నేరాలు అరికడదాం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ముమ్మర చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బరంపుర్ ఎస్పీ శరవణ వివేక్ ఎం.గజపతి జిల్లా ఎస్పీ స్వాతి కుమారిలతో కలిసి శనివారం ఆమె అంతర్‌రాష్ట్ర సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. గంజాం (బరంపుర్) ఎస్పీ శరవణ వివేక్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా 115 కిలోమీటర్ల సరిహద్దును గజపతి, గంజాం జిల్లాలతో కలిగి ఉందని, ఎనిమిది పోలీస్‌స్టేషన్లు, ఆరు సెబ్ పోలీసు స్టేషన్లు సరిహద్దులో జరుగుతున్న నేరాలపై పటిష్ట నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లోని 53 గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు తమ వంతుగా సహకారం అందించాలని వారిని కోరారు. జిల్లాలో నాలుగు అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని, ఆయా చెక్‌పోస్టుల ఇవద్ద 24 గంటలూ అప్రమత్తంగా ఉండి స్పెషల్ పార్టీ సిబ్బందిని కేటాయించి విస్తృతంగా వాహన తనిఖీలు చేపడతామన్నారు. దీనికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో జిల్లా అదనపు ఎస్పీ (జేడీ) విజయ నాగమణికంఠ, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎస్పీలు డి.బాలచంద్ర, నాగేశ్వరరెడ్డి, కె.బాలరాజు, సీఐలు ఈశ్వరప్రసాద్, శంకరరావు, వినోద్‌బాబు, వేణు గోపాల్, గజపతి జిల్లా డీఎస్పీ మధన బంద నాయక్, ఇన్‌స్పెక్టర్స్ ప్రసన్న భూపతి, గోవింద్, రీన రాణి, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముగిసిన చౌయితి ఉత్సవాలు



ఆదివాసీ కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దశ్యం

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న చౌయితి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి అశోక్ చంద్ర పండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికపరంగా రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందని తెలియజేశారు. భిన్న సంస్కృతులు కలిగిన మన రాష్ట్రంలో అన్నింటికీ సరైన ప్రాధాన్యత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదివాసీ సాంప్రదాయలు, భాష, కళలకు గౌరవాన్ని ఇస్తున్నామని వెల్లడించారు. కొద్ది నెలలు క్రితం రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఆదివాసీల అభ్యున్నతికి ఎస్‌డీసీ సంస్థలను ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, ఎస్డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షులు సరస్వతి మాఝి, ఏడీఎం భాస్కరరైతా, సబ్ కలెక్టర్ కల్యాణి, రాయగడ ఎమ్మెల్యే మకరందం ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో తదితరులు పాల్గొన్నారు. – రాయగడ



వేడుకలు తిలకించేందుకు హాజరైన ప్రజలు



దివ్యాంగుల నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న మంత్రి పండ



శివతాండవ నృత్యం



గుజరాతీ నృత్యం



బస్తర్ జిల్లా కళాకారుల నృత్య ప్రదర్శన



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మంత్రులు



ఆదివాసీ నృత్యం



నృత్య ప్రదర్శనలో కళాకారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



మల్కన్‌గిరి: కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద రెండు మృతదేహాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 పోలీసుస్టేషన్ పరిధి ఎంవీ 96 గ్రామం వద్ద శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొని వెళ్లిపోయింది. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మృతులు ఎంవీ 72 గ్రామానికి చెందిన దూల బార్సి(33), భీమ (23)లుగా నిర్ధారించారు. దూల బార్స తన భార్యతో కలిసి కలిమెలలోని బంధువుల ఇంటి నుంచి సొంత గ్రామమైన ఎంవీ 72కు వస్తున్నారు. భీమ కూడా ఎంవీ 79 నుంచి ఇంటికి వస్తున్నారు. వీరిని మల్కన్‌గిరి నుంచి మోటు వైపు వెళ్తున్న ఒక వాహనం ఢీకొంది. దీంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో దూల భార్య కేకలు వేయగా అటువైపు వచ్చిన ఒక వాహనదారుడు పోలీసులు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దూల భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలును కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జయపురం: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందిన ఘటన జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితి భుషంగగుడ గ్రామ సమీపంలో చోటుచేసుకుందని ఏఎస్ఐ పురుషోత్తమ రాయ్ శనివారం తెలియజేశారు. మరణించిన యువకుడు కోట్‌పాడ్ సమితి చిత్ర పంచాయతీ డొంగొర గ్రామానికి చెందిన మోదీరాం భోత్ర(16)గా వెల్లడించారు. శుక్రవారం రాత్రి నొయికెర గ్రామంలో జరిగిన నాటకాన్ని చూసి రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తూ, కుంద్ర సమితి భుషంగగుడ గ్రామ కెనాల్ సమీపంలో మలుపు తిరుగుతుండగా బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మోదీరాం తలకు, ఛాతీపై బలమైన గాయాలయ్యాయి. వెంటనే ప్రమాదాన్ని చూసిన స్థానికులు 108 అంబులెన్స్‌లో కుంద్రా కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మరణించినట్లు డాక్టర్లు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భారీగా కలప స్వాధీనం



కళ్లికోట్ అటవీ ప్రాంతంలో కలప దుంగలు



దుంగలను పరిశీలిస్తున్న అధికారులు



కలపను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

బరంపురం: మొక్కలు నాటి పచ్చదనంతో పర్యావరణం కాపాడుకుందామని ఒకవైపు నాయకులు పిలుపునిస్తుండగా, మరోవైపు గంజాం జిల్లాలో పచ్చని చెట్లను నరికివేసి అటవీ సంపదను దోచుకుంటున్న కలప మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. శనివారం జిల్లా అటవీ శాఖ అధికారులు కళ్లికోట్ కన్నరియాబడి అటవీ ప్రాంతంలో అటవీ సంపదను దోచుకుంటున్న గ్యాంగ్‌పై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా లక్షలాది రూపాయులు విలువచేసే కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి దగ్గరలో నిల్వ ఉంచిన గోదాముపై దాడులు చేసి కలపను సీజ్ చేశారు. అయితే అధికారులు ఎవరినీ అరెస్టు చేయకపోవడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల పేర్లు నమోదు చేయాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: నిర్మాణ శ్రామికుల కల్యాణ బోర్డు పథకంలో పేర్లు నమోదవ్వని శ్రామికుల పేర్లను పథకంలో నమోదు చేయాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కోరారు. బొరిగుమ్మ టౌన్ హాల్‌లో నిర్మాణ కార్మికుల కల్యాణ బోర్డు పథకం లబ్ధిదారులకు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన, గృహ నిర్మాణాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అయితే పథకంలో ఎక్కువ మంది పేర్లు నమోదవ్వకపోవడంతో ప్రయోజనం అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై లేబర్ విభాగ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా సమితి అధ్యక్షురాలు దీప్తి మయి నాయిక్, ఉపాధ్యక్షుడు రమాకాంత సామంతరాయ్, జిల్లా పరిషత్ సభ్యురాలు మంజుల ఘాసి, బొరిగుమ్మ బీడీవో విక్రమ కుమార్ దొర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సన్మానం



ఉత్తమ రైతులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక దసరా పోడియాలో జిల్లా వ్యవసాయ విభాగం వారు నిర్వహిస్తున్న ప్రాంతీయ వ్యవసాయ యంత్రాల మేళాలో భాగంగా శుక్రవారం రాత్రి 12 మంది ఉత్తమ రైతులను సన్మానించారు. కొరాపుట్ జిల్లా ప్రధాన వైద్యాధికారి ప్రదీప్ కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధాన్యం, వివిధ పంటలు, కాయగూరల పంటలు, మత్స్య వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన విభాగ డైరెక్టర్ సుధామ్ చంద్ర బిశ్వాల్, గౌరవ అతిథిగా మృత్తికా సంరక్షణ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ కుమార్ దాస్, రాయగడ జిల్లా వ్యవసాయ అధికారి మనోజ్ ప్రధాన్, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ, వ్యవసాయ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోష్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల టెన్నీకాయిట్ పోటీలు

పాతపట్నం: పాతపట్నం మినీ స్టేడియం క్రీడా మైదానంలో 41వ రాష్ట్ర అంతర్ జిల్లాల స్త్రీ,పురుషుల టెన్నీకాయిట్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో గెలుపొందిన విజేతలు పీ.జే.ఎం.డి.రామారావు(తూర్పు గోదావరి), వి.వినయ్ కుమార్(తూర్పు గోదావరి), సీహెచ్ తారకేశ్వరరావు(శ్రీకాకుళం), ఎల్.త్రిమూర్తిలు(తూర్పు గోదావరి), కె.వంశీ(పశ్చిమ గోదావరి), బి.చంటి(పశ్చిమ గోదావరి), పి.జగదీష్(శ్రీకాకుళం), బాలికల విభాగంలో గెలుపొందిన విజేతలు ఆర్.మౌనిక(విజయనగరం), పి.రేణుక(విజయనగరం), ఎం.ప్రవల్లిక(విజయనగరం), జి.శ్రావణి(విజయనగరం), జి.అమృత(అనకాపల్లి), ఎస్.పల్లవిశ్వేతశ్రీ(విశాఖపట్నం), కె.మౌనిక(పశ్చిమ గోదావరి), వై.అలేఖ్య(పశ్చిమ గోదావరి) గెలుపొందారని జిల్లా టెన్నీ కాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెన్ని శేఖరబాబు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు టెక్కలి డిప్యూటీ డీఈఓ పగడాలమ్మ, వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర టెన్నీ కాయిట్ జనరల్ సెక్రటరీ పి.తవిటయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నల్లి రాజారావు, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అధ్యక్షుడు గురాడ అప్పన్నల చేతులమీదుగా సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందించారు.

క్లుప్తంగా

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం రూ. 2.50 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 136 రోజులకు రూ.2,50,782లు సమకూరిందని ఈఓ బి.వి.మాధవరావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి సమక్షంలో సాగిన హుండీల ఆదాయం లెక్కింపులో ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు గరివిడి విద్యార్థి



జి.వాసు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో సెకెండ్ ఇయర్ బీఎస్సీ చదువుతున్న జి.వాసు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీల్లో 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో ప్రథమ స్థానం సాధించి జనవరి 4 నుంచి 7వ తేదీవరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థిని కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

జాతీయ పోటీల్లో రాజేశ్వరి సత్తా



తాను సాధించిన పతకాన్ని చూపిస్తున్న క్రీడాకారిణి రాజేశ్వరి

నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని కొండవెలగాడకు చెందిన క్రీడాకారిణి బి.రాజేశ్వరి సత్తా చాటింది. ఈ నెల 28వ తేదీ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో జరుగుతున్న ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 40 కేజీల విభాగంలో ఈమె పాల్గొని, స్నాచ్‌లో 64 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 144 కిలోల బరువును ఎత్తి, కాంస్య పతకం దక్కించుకుంది. ఈ మేరకు ఆమెను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

నా భర్త మృతదేహాన్ని అప్పగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎర్నమ్మ, ఆమె కూతుళ్లు



బంగారునాయుడు(ఫైల్)

జామి: నా భర్త మృతదేహం అప్పగించాలని విజ్ఞప్తి చేస్తూ మృతుడు కొత్తలి బంగారునాయుడు భార్య ఎర్నమ్మ కలెక్టర్, తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఉపాధి కోసం కొంతమందితో కలిసి నవంబర్ 21వ తేదీన దుబాయి వెళ్లిన తన భర్త చనిపోయాడని తన భర్తతో పాటు దుబాయి వెళ్లిన సీహెచ్ మహాలక్ష్మి అనే మహిళ ఈ నెల 29వ తేదీన ఫోన్ చేసి, చెప్పిందని, ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త మృతి వార్తతో తామంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యామని, వేదన చెందుతున్నామని వాపోయారు. అక్కడి వారికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ కలవడం లేదన్నారు. అధికారులు స్పందించి, ఎలాగైనా తన భర్త మృతదేహం గ్రామానికి తెప్పించాలని ఆమె కోరారు.

పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



గిరిజనులతో సమావేశమై, పీఎం జన్‌మన్ పథకంపై అవగాహన కల్పిస్తున్న కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ శాంఫే

సీతంపేట: పీవీటీజీ(పర్టికులర్ వాలనరబుల్ ట్రైబ్ (గ్రూప్) గ్రామాలు, అక్కడి గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ శాంఫే అన్నారు. శనివారం మండలంలోని వెదులవలస గ్రామాన్ని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ మల్లిఖార్జునరెడ్డితో కలిసి సందర్శించిన ఆయన పీఎం(ప్రధానమంత్రి) జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీ గ్రామాలకు తాగునీరు, రోడ్లు, గృహాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.2.30 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీనికోసం సర్వే జరుగుతోంద ని, గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ఎంపీడీవో గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదికి...
మొక్కవోని స్వాగతం



డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పూల మొక్కల గ్యాలరీ



మహిళా సంఘాలకు విక్రయించనున్న మొక్కలు

- కొత్త సంవత్సరానికి వైకేపీ కొత్త ఆహ్వానం
- అన్ని మండల సమాఖ్యల ఆధ్వర్యంలో మొక్కల విక్రయాలు
- ప్రస్తుత ట్రెండును ఫాలో అవుతున్న డీఆర్‌డీఏ అధికారులు
- న్యూ ఇయర్ శుభాకాంక్షలకు పూలమొక్కల వ్యాపారం
- ఫ్లవర్ బొకేల స్థానంలో మొక్కలకు ప్రాధాన్యం
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 2.20 లక్షల పెట్టుబడితో మొక్కల కొనుగోలు
- ఒక్కో మండలానికి 70 నుంచి 100 మొక్కల కేటాయింపు
- మండల సమాఖ్యలకు చేరుకున్న మొక్కలు

రాజాం: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహిస్తోంది. శిక్షణ ఇప్పిస్తోంది. మార్కెట్‌లోని కొత్తపోకడలను అందిపుచ్చుకునేలా మహిళా వనరులను తీర్చిదిద్దుతోంది. వ్యాపార దృక్పథాన్ని పెంపొందిస్తోంది. ప్రభుత్వ ఆశయాన్ని అందిపుచ్చుకునేలా వ్యాపారాల్లో మహిళా సంఘాల సభ్యులను డీఆర్‌డీఏ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా మరో రెండురోజుల్లో ప్రారంభంకానున్న కొత్త సంవత్సరానికి కొత్త వ్యాపారం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా కొత్త ఏడాదికి స్వాగతం చెప్పేవారికి పూలబొకేల స్థానంలో చౌకగా పూలమొక్కల విక్రయాలకు సన్నద్ధమవుతున్నారు.

ఫ్లవర్ బొకేలకు బదులు పూల మొక్కలు

ప్రస్తుతం ఏ రాజకీయ నాయకుడిని కలిసినా, ఏ ఇంట్లో శుభ కార్యక్రమమైనా, ఏ కొత్త ఉద్యోగిని కలిసినా గతంలో ఇచ్చే పూలబొకేల స్థానంలో పూలమొక్కలు ఇచ్చే సంస్కృతి వచ్చింది. 2024 ఏడాదికి స్వాగతం పలుకుతూ పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇదే తరహా కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మేరకు అన్ని చోట్ల నాయకులు, ఉద్యోగులు, ప్రజలు తమ అభిమానులను కలిసి, న్యూఇయర్ శుభాకాంక్షలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. వీరంతా ఫ్లవర్ బొకేల స్థానంలో పూలమొక్కలు ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకున్న డీఆర్‌డీఏ అధికారులు జిల్లాలోని అన్ని మండల సమాఖ్యల ద్వారా మహిళా సంఘాల సభ్యులతో పూలమొక్కలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ క్రాంతిపథంలో భాగంగా ఈ నెల 30 నుంచి రెండు రోజుల పాటు పూలమొక్కల విక్రయాలు ఆయా ప్రాంతాల్లో జరగనున్నాయి.

2.20 లక్షల పెట్టుబడితో...

ఈ ఏడాది ఈ వ్యాపారాన్ని కొత్తగా ప్రారంభించిన డీఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే అన్ని మండలాల నుంచి ఇండెంట్‌లు తెప్పించుకున్నారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘాలతో మండలాల్లో మొక్కలు విక్రయాలు జరిపేందుకు స్టాల్స్‌ను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.2.20 లక్షల పెట్టుబడితో నర్సరీలు నుంచి మొక్కలు తెప్పించారు. ఈ మొక్కల్లో ఒక్కో మండలానికి 70 నుంచి 100 చొప్పున పంపిణీ చేస్తున్నారు. వీటిలో విలువైన చామంతి, గులాబీ, ఆంథూరియం, అగ్లోనెమా వంటి ఇండోర్, అవుట్ డోర్ మొక్కలు ఉన్నాయి. ఒక్కో మొక్క ఖరీదు మార్కెట్‌లో కంటే తక్కువగా రూ.100లు నుంచి విక్రయించే ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీ, ఆర్టీసీ కాంప్లెక్స్‌లతో పాటు అన్ని మండలాల్లో ప్రధాన మార్కెట్‌లు, రోడ్లు, ఎమ్ఎమ్ఎస్ కార్యాలయాల వద్ద వీటిని సిద్ధంచేస్తున్నారు.



మహిళలను ప్రోత్సహించేందుకు..



రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషిచేస్తోంది. సకాలంలో బ్యాంకు రుణాలను అందజేయడంతో పాటు వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక సాయం చేస్తోంది. దీంతో చాలా మంది మహిళలు వ్యాపారాలపై దృష్టిసారిస్తున్నారు. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మార్కెట్‌లో కొత్త వ్యాపారాలపై దృష్టిసారించాం. మహిళలకు వ్యాపారాలపై అవగాహన పెంచడం, వాటి ద్వారా వచ్చే లాభాల రుచి చూపించడం చేస్తున్నాం. కలెక్టర్ నాగలక్ష్మి సలహాలతో కొత్త ఏడాదికి డబ్బులు పోసి నిరుపయోగంగా మారే ఫ్లవర్ బొకేలు కంటే ఇంట్లో పెంచుకునే అరుదైన పూలమొక్కలు ఇస్తే బాగుంటుందనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి విక్రయాలతో మహిళల్లో వ్యాపార దృక్పథం పెంపొందించాలన్నదే ప్రధాన ఉద్దేశం.

– ఎ.కళ్యాణచక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం



వినూత్నమైన ఇండోర్ మొక్కలు

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



వెండి మండపం వద్ద సీతారామస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేషహోమాలు జరిపించారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.





ఉల్లికాడలు విక్రయిస్తున్న రైతులు

ఉల్లికాడలకు భలే గిరాకీ



రామభద్రపురం అంతరాష్ట్ర మార్కెట్లో ఉల్లి కాడలు తూకం వేస్తున్న వ్యాపారి

రామభద్రపురం అంతర రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో ఉల్లిగడ్డల కంటే ఉల్లికాడల ధర మూడింతలు ఎక్కువ పలుకుతోంది. గతంలో ఉల్లి రైతులు కాడలను తెంచి ఇరుగుపొరుగు వారికి పంచిపెట్టేవారు. లేదంటే పొలంలోనే వదిలేసేవారు. ఇప్పుడు అవే ఉల్లి కాడలు మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. – రామభద్రపురం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

- విజయనగరం కింగ్స్, పార్వతీపురం పయనీర్స్ మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్
- పాల్గొన్న ఇరు జిల్లాల పోలీస్ అధికారులు
- విజేతగా నిలిచిన పార్వతీపురం పయనీర్స్ జట్టు



టాస్ వేసి, మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పక్కనే జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని విజయనగరం కింగ్స్, పార్వతీపురం పయనీర్స్ మధ్య శనివారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు టాస్ వేసి, మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వహిస్తూ, ఎంతో ఒత్తిడికి గురయ్యే పోలీసులు ఉపశమనం పొందేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు మంచి ఆలోచన చేశారన్నారు. ఈ మ్యాచ్‌తో పోలీస్ అధికారుల్లో ఉత్సాహాన్ని, క్రీడాస్ఫూర్తిని నింపారన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలోనూ, నేరాలు నిరోధించడంలోనూ ఎస్పీ కృషి అభినందనీయమన్నారు. పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్ మెరుగుపర్చేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం కూడా గ్రామస్థాయిలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం పేరిట క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడాదికాలంగా ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి, కొత్త ఉత్సాహంతో నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న పోలీస్ అధికారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు రెండు జిల్లాల ఎస్పీలు సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ముగింపు వేడుకల్లో ఇరుజిల్లాల ఎస్పీలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొత్త సంవత్సరానికి ముందు ఇరుజిల్లాల పోలీస్ అధికారుల్లో ఈ క్రికెట్ మ్యాచ్ మంచి ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో సమష్టిగా పనిచేసి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. ఎస్ఐ నవీన్ పడాల్ 58(44) పరుగులు, ఎస్ఐ నాయుడు 16 పరుగులు చేశారు. 148 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పార్వతీపురం పయనీర్స్ జట్టు 18.1 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్య ఛేదన చేసి, విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్టుకు ట్రోఫీ బహూకరించారు. ఎస్ఐ అనిష్ 50 పరుగులు, ఎస్ఐ అజయ్ 45 పరుగులు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ 22 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. మూడు వికెట్లతో పాటు 50 పరుగులు చేసిన ఎస్ఐ అనిష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకోగా, బెస్ట్ బ్యాటర్‌గా ఎస్ఐ నవీన్‌పడాల్, బెస్ట్ బౌలర్‌గా సీఐ వెంకటరావు, బెస్ట్ ఫీల్డర్‌గా ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, బెస్ట్ క్యాచర్‌గా ఎస్ఐ షన్ముఖరావు ఎంపికయ్యారు. మ్యాచ్‌లో పార్వతీపురం అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ సరోన్, పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ట్రైనీ డీఎస్పీ మహ్మద్ షేక్ అజీజ్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐలు కె.కె.వి.విజయనాథ్, బి.వెంకటరావు, ఆర్ఐలు శ్రీనివాసరావు, గోపాలనాయుడు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ దీపిక

నిర్విఘ్నంగా ఆటల యజ్ఞం

అంతర్జాతీయ ఆటల పోటీల్లో అమెరికా, చైనా, జపాన్ తదితర దేశాలు దశాబ్దాలుగా పతకాల పట్టికలో ఆధిపత్యం సాధిస్తూ వస్తున్నాయి. దీనికి ఆయా దేశాలు అందిస్తున్న క్రీడా ప్రోత్సాహం.. క్రీడా అవకాశాలు.. క్రీడాకారుల కఠోర సాధనే కారణం. అదే స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం ఆటల యజ్ఞాన్ని ఆరంభించింది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 47 రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీసే క్రతువును నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది.

- ఊరూరా ఆటల సంబరం
- ఉత్సాహంగా పాల్గొంటున్న యువతీయువకులు
- క్రీడాస్ఫూర్తితో రాణింపు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పోటీలు సాగుతున్నాయి ఇలా...

జిల్లా	సచివాలయాలు	మైదానాలు	క్రీడాకారులు
విజయనగరం	626	346	1.42లక్షల మంది
పార్వతీపురం మన్యం జిల్లా	350	139	65,905

విజయనగరం డెస్క్: ఏదైనా ఒక రంగంలో రాణించాలంటే చక్కని ప్రణాళిక కావాలి. దాని అమలుకు అవసరమైన అవకాశాలు సృష్టించాలి. పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో... భవిష్యత్తును అంచనా వేస్తూ ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ దిశగానే పయనిస్తోంది. ఏ రంగాన్ని తీసుకున్నా స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం, పర్యాటకం, క్రీడాలు ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధిస్తోంది. దీనికోసం పటిష్టప్రణాళికలు వేస్తూ నిరంతరం శ్రమిస్తోంది. మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యా, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా ఇప్పటికే ఒకటో తరగతి నుంచి ఆంగ్ల విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు క్రీడల్లో ప్రోత్సహిస్తోంది.

సమస్తం సమకూర్చుతూ...

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగుతున్నాయంటే దానివెనుక ప్రభుత్వ పరంగా స్పష్టమైన ఆదేశాలు... అధికార యంత్రాంగం కృషి కనిపిస్తోంది. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు దశల్లో... ఐదు క్రీడాంశాల్లో 47 రోజుల పాటు సాగే ఆటల సంబరానికి క్రీడాకారుల పేర్లు నమోదు... రిఫరీల ఎంపిక... పీడీలు, పీఈటీల నియామకం... మైదానాలు సిద్ధం చేయడం.. క్రీడాకారులకు కావాల్సిన సమస్త ఆటసామగ్రి సమకూర్చడం... విజేతలకు బహుమతుల ప్రదానం... ఇలా... అన్నింటా ఎక్కడా రాజీపడకుండా పక్కాగా ఏర్పాట్లు చేసింది. దీనివెనుక ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే..... క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడం... వారి ప్రతిభకు పదును పెట్టడం.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో మన రాష్ట్ర విద్యార్థులు పతకాల పంటపండిచేలా తీర్చిదిద్దడం... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం. దీనికోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోంది. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా విషం కక్కుతున్నా లక్ష్యసాధన కోసం నిరంతరాయంగా శ్రమిస్తోంది. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికార యంత్రాంగం క్రీడా యజ్ఞాన్ని ముందుకు సాగిస్తోంది. ఈ యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవుతున్నారు. ఊరి యువత ఆటల్లో తలపడుతుంటే చప్పట్లతో అభినందిస్తున్నారు. ప్రోత్సహిస్తున్నారు. ఫలానా వారి అబ్బాయి క్రీడల్లో రాణిస్తాడంగూ రచ్చబండలపై చర్చించుకుంటున్నారు. ఇప్పుడు ఏ ఊరిలో చూసినా ఆటల పండగే కనిపిస్తోంది.



ప్రభుత్వం సరఫరా చేసిన ఆట పరికరాలు

విజేతలకు బహుమతుల ప్రదానం ఇలా...

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లోని విజేతలకు ప్రభుత్వం బహుమతులు అందజేయనుంది. నియోజకవర్గ స్థాయిలోని విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన వారికి రూ.5లక్షలు, రూ.3లక్షలు, రూ.2లక్షలు అందజేయనుంది. బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో మొదటి ముగ్గురికి రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ.35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు వరుసగా రూ.2లక్షలు, రూ.లక్ష, రూ.50వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనుంది.



విజేతలకు అందజేసేందుకు సిద్ధంచేసిన ట్రోఫీలు

యువతలో స్ఫూర్తినింపుతున్న బ్రాండ్ అంబాసిడర్లు

పోటీలకు జిల్లా స్థాయి అంబాసిడర్లుగా నియమితులైన కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పతక విజేత మత్స్యసంతోషి, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి శ్రీలక్ష్మి, స్కేటింగ్ క్రీడాకారుడు సాయితేజ తదితరులు క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఆటల్లో రాణిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

ఆడుదాం-ఆంధ్రా పోటీలు సచివాలయ వేదికగా ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగుతున్నాయి. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రజలు క్రీడామైదానాల వద్దకు వచ్చి ఆటలను తిలకిస్తున్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఏ ఊరిలో చూసినా ఆటల సంబరమే కనిపిస్తోంది. ఇది మంచి ఆరోగ్యకర వాతావరణం. యువతలో క్రీడావికాసం పెంపొందుతోంది. వచ్చేఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు పోటీలు సాగనున్నాయి. – బి.రామ్‌గోపాల్, సీతంపేట, సెట్విజ్